రోల్ మోడల్‌గా ఉద్యాన పార్కు

- రూ.30 లక్షలతో అభివృద్ధికి ప్రణాళిక
- రూ.10 లక్షలతో పిల్లల పార్కు ప్రగతికి చర్యలు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ అభివృద్ధికి ఒక్కొక్కటిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే పట్టణాన్ని ఆనుకుని ఉన్న మూడు బైపాస్ రోడ్ల ఆధునీకరణతో పట్టణ ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించారు. ఇప్పుడు పట్టణ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు వాటర్ వర్క్స్‌ను ఆనుకుని ఉన్న చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనం, తామరచెరువు వద్ద ఉన్న డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యానవనాలు అన్ని రకాల వినోద, విహార సౌకర్యాలతో రూపుదిద్దుకున్నాయి. ఇప్పటికే తామర చెరువు వద్ద ఉన్న ఉద్యానవనం అదనంగా జిమ్ సౌకర్యంతో అలరారుతోంది.

చంద్రబాబు ఉద్యానవనాన్ని జిల్లాకే ఓ రోల్ మోడల్ పార్కుగా తీర్చిదిద్దే ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. దాదాపు రూ.30 లక్షలతో ఈ పార్కును అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు మున్సిపాలిటీ త్వరలోనే కౌన్సిల్ అజెండాలో ఓ ప్రత్యేక అంశంగా చేర్చనుంది. దీనికితోడు స్థానిక వడ్డిగూడెం ప్రవేశంలో మున్సిపల్ కమిషనర్ క్వార్టర్స్ వద్ద ఉన్న మున్సిపల్ పిల్లల పార్కులోనూ చిన్న పిల్లలు ఆడుకునే పలు పరికరాలు పాడైపోయాయి. దీనిపై కూడా మున్సిపాలిటీ చర్యలు చేపడుతోంది. త్వరలోనే రూ.10 లక్షల వ్యయంతో పార్కును పూర్తి ఆధునీకరించేందుకు సిద్ధమవుతోంది. వచ్చే మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో రూ.10 లక్షల అభివృద్ధి అంశం ఆమోదానికి రానుంది. ఇలా పార్కుల ప్రగతి కోసం రూ.40 లక్షలతో రెండు రకాల ప్రణాళికలను మున్సిపాలిటీ రూపొందించి అమలుకు సన్నద్ధమవుతుంది. అలాగే దాదాపు రూ.కోటి వ్యయంతో అభివృద్ధి చేస్తున్న స్థానిక గరిగుంట చెరువు చుట్టూ ఆరోగ్య ఉద్యానవనం సైతం రూపుదిద్దుకోనుంది.


చంద్రబాబు ఉద్యానవనం

మిగిలిన పార్కులను పట్టించుకుంటే

మున్సిపాలిటీలో మూడు పార్కులకు అభివృద్ధి పరంగా మహర్దశ పడుతుంటే స్థానిక ఎన్టీఆర్ మార్గ్‌లో కిలోమీటరు మేర పంట కాల్వ చెంత విస్తరించి ఉన్న కాటన్ పార్కు ఆదరణ లేక అసౌర్యంగా కనిపిస్తోంది. అలాగే పట్టణంలో అతిపెద్ద కాలనీ అయిన హౌసింగ్ బోర్డు కాలనీలోని పార్కు సైతం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. స్థానిక కౌండిన్య నగర్‌లోని పార్కు కూడా అభివృద్ధికి నోచుకోవడం లేదు. కాటన్ పార్కు ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ పర్యవేక్షణలో ఉందని, హౌసింగ్ బోర్డు కాలనీలో పార్కు కోర్టు కేసు వివాదంతో ఉందన్న కారణాలతో మున్సిపాలిటీ ఆ పార్కుల అభివృద్ధిపై అంతగా దృష్టి పెట్టడం లేదు. చంద్రబాబు, డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు, పిల్లల పార్కులపైనే మున్సిపాలిటీ ఫోకస్ పెట్టినట్లైంది. మిగిలిన ఆ మూడు పార్కుల అభివృద్ధిపై కూడా మున్సిపాలిటీ దృష్టిపెడితే పట్టణమంతా ఆహ్లాదంతోనే నిండి ఉంటుందని పట్టణ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.


సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ చుట్టూ విస్తరించిన చంద్రబాబు ఉద్యానవనం

> **ఆరోగ్యవనాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం**
>
> వాటర్ వర్క్స్, సమ్మర్ స్టోరేజ్ రిజర్వాయరు(తాగునీటి చెరువు) చెంతనే ఉన్న చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం. ఈ ఉద్యానవనాన్ని జిల్లాలో ఓ రోల్ మోడల్‌గా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో రూ.30 లక్షలు నిధుల కేటాయిస్తున్నాం. ఇప్పటికే పట్టణంలో ఉద్యాన వనాలకు సందర్శకుల సంఖ్య విపరీతంగా పెరిగింది. పార్కుల అభివృద్ధితో రానున్న రోజుల్లో మరింత ఆహ్లాదం నిండుతుందనడంలో సందేహం లేదు.
>
> – ఒమ్మి అయ్యప్పనాయుడు, కమిషనర్, అమలాపురం మున్సిపాలిటీ

సంక్షేమ రాజ్యం ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యం

- మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్
- ఓడలరేవులో గడప గడపకూ మన ప్రభుత్వం

అల్లవరం: సంక్షేమ ఫలాలు క్రమం తప్పకుండా లబ్ధిదారులకు అందించే సంక్షేమ రాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. ఓడలరేవులో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా తొమ్మిది రకాల సేవలను లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. నెల రోజుల పాటు ఈ కార్యక్రమం అన్ని గ్రామాల్లో నిర్వహిస్తారన్నారు. సంక్షేమ పథకాలకు ఈ పత్రాలే ప్రామాణికమని, ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఏవైతే హామీలు ప్రకటించామో అవి 95 శాతం అమలు చేసి మీ ముందుకు వచ్చామని శ్రీకాంత్ తెలిపారు. సమస్యలు ఉంటే చెప్పాలని, వాటిని పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తామని భరోసా కల్పించారు. సంక్షేమ పథకాలు కొనసాగించాలంటే వైఎస్ జగన్ మరో మారు ముఖ్యమంత్రి కావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహసారథుల మండల కన్వీనర్ తిక్కా వెంకటప్రసాద్, సర్పంచ్ బర్రే సీతారత్నం, ఎంపీటీసీ పులుసుగంటి రాజేశ్వరి, సొసైటీ చైర్మన్ చొల్లంగి రాధాకృష్ణ, పార్టీ నాయకులు మల్లాడి ఉమామహేశ్వరరావు, మధుర కుమారస్వామి, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఓడలరేవులో సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న పినిపే శ్రీకాంత్

నర్సింగ్ ఎంట్రన్స్‌కు ఈ ఏడాదికి మినహాయింపు

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఎంట్రన్స్ టెస్ట్ ప్రవేశపెట్టాలని నిర్ణయించిన ఆరోగ్యశాఖ ఈ ఏడాదికి మినహాయింపును ఇస్తున్నట్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఎంట్రన్స్ నిర్వహించాలని నేషనల్ మెడికల్ కౌన్సిల్ గతంలో ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో ఎంట్రన్స్ టెస్ట్ నుంచి ఈ ఏడాదికి మినహాయింపు ఇవ్వాలని నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు స్టేట్ హెల్త్ డిపార్ట్‌మెంట్ నుంచి లేఖ రాయడంతో పాటు ఎల్జీ తమిళిసై, సీఎం రంగసామి సైతం కేంద్ర ఆరోగ్యశాఖతో మాట్లాడారు. దీంతో ఈ ఏడాదికి ఎంట్రన్స్ నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు మెడికల్ కౌన్సిల్ ప్రకటించింది.

బ్యాంకులు సేవాభావంతో పనిచేయాలి

కలెక్టర్ హిమాన్షు శుక్లా


హెచ్‌డీఎఫ్‌సీ బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు

ముమ్మిడివరం: బ్యాంకులు కేవలం వ్యాపార దృక్పథంతో కాకుండా సేవాభావంతో వ్యాపార లావాదేవీలు సాగించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. ముమ్మిడివరంలో నూతనంగా ఏర్పాటు చేసిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు బ్రాంచ్ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ ప్రభుత్వం అందించే రుణాలకు బ్యాంకులు మేచింగ్ గ్రాంట్లు సక్రమంగా విడుదల చేసి లబ్ధిదారుల వ్యాపారాభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కమిషనర్ జి.లోవరాజు, ఆర్‌డీఓ వసంతరాయుడు, క్లస్టర్ హెడ్స్ పీఎస్ రాజ్‌కిరణ్, పి.నరేష్, బ్రాంచ్ మేనేజర్ ఎస్‌వీఎస్‌డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు సత్కారం


ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను సత్కరించిన మన్నా కాలనీ గ్రామస్తులు

అల్లవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీగా విజయం సాధించి తొలిసారి కొమరగిరిపట్నం విచ్చేసిన ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ను మన్నా కాలనీ గ్రామస్తులు పూలమాలలు, దుశ్శాలువాలతో గురువారం ఘనంగా సత్కరించారు. 75 ఏళ్ల చరిత్రలో మాదిగ సామాజిక వర్గానికి తొలిసారి ఎమ్మెల్సీ పదవి కేటాయించడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 200 మంది పార్టీలో చేరి, సీఎం జగన్‌పై అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, మల్లవరపు రాఘవులు, ముసునూరి బులిరాజు, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఓట్లు అడిగే అర్హత పవన్‌కు లేదు

కాట్రేనికోన: వారాహి యాత్రలో భాగంగా ముమ్మిడివరం బహిరంగ సభలో ఎస్సీ, ఎస్టీల ప్రస్తావన లేకుండా ఇతర కులాలకు మాత్రమే ప్రాధాన్యతనిచ్చిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు దళితుల ఓట్లు అడిగే అర్హత లేదని ముమ్మిడివరం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఉపాధ్యక్షుడు కాశి హనుమంతరావు అన్నారు. జనసేన పార్టీ కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న పితాని బాలకృష్ణకు బహిరంగ సభలో వారాహి వాహనంపై స్థానం లేక పోవడం అవమానించడమేనన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుస్తుందని, తన ఓటమిని అంగీకరించిన పవన్‌కల్యాణ్ నిజాయతీకి కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

పోలవరం నిర్వాసితులను ఆదుకోవాలి

తాళ్లరేవు: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఎం పార్టీ తాళ్లరేవు మండల కమిటీ డిమాండ్ చేసింది. గురువారం స్థానిక ప్రజాసంఘాల భవనంలో జరిగిన సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి టి.ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రాజెక్టు కోసం తమ ఊర్లు, భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో వి.రాజబాబు, డి.అదృష్టదీపుడు, పి.గోపాలకృష్ణ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో పూడికల తొలగింపు


జేసీబీ సాయంతో తొలగిస్తున్న డ్రైనేజీ పూడికలు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు కేశవ స్వామి బైపాస్ కాలనీలో డ్రైనేజీలో పూడికల తొలగింపును శుక్రవారం చేపట్టారు. డ్రైనేజీ పూడుకుపోవడంతో మురుగునీరు బయటకు వెళ్లడంలేదని కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో స్థానిక సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి తక్షణమే స్పందించి జేసీబీ సాయంతో పూడిక తొలగింపు చర్యలు చేపట్టారు. పనులను సచివాలయ కార్యదర్శి టి.వేణుగోపాల్ పర్యవేక్షించారు.

విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయాలి

ముమ్మిడివరం: హైకోర్టు న్యాయవాది, ఆర్‌పీఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బొజ్జా తారకం విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయాలని విగ్రహ ఆహ్వాన కమిటీ కన్వీనర్ పెనుమాల సుధీర్ పిలుపునిచ్చారు. ఈ నెల 27న తారకం జయంతి వేడుకల సందర్భంగా స్థానిక పోలమ్మ చెరువు గట్టుపై ఏర్పాటు చేసిన విగ్రహాన్ని మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌లు ఆవిష్కరిస్తారని చెప్పారు. ఆవిష్కరణకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌పీఐ నాయకులు పంతగడ నరసింహమూర్తి, శరత్, వజ్రపు శరత్, కేఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక


దినేష్


దివ్య ప్రసన్న

తాళ్లరేవు: మండలంలోని రెండు పాఠశాలల నుంచి ఇద్దరు విద్యార్థులు నవోదయ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి ఎంపికయ్యారు. పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు ప్రాథమిక పాఠశాల నుంచి దంగేటి దినేష్ నవోదయకు ఎంపికైనట్లు హెచ్ఎం కాశి రవీంద్ర తెలిపారు. కోరంగి శ్రీబాల భారతి విద్యానికేతన్ విద్యార్థిని మాసగిరి దివ్యప్రసన్న నవోదయకు ఎంపికైనట్లు స్కూల్ హెచ్ఎం పితాని బాల వెంకటరమణ చెప్పారు. నవోదయకు ఎంపికైన విద్యార్థులను పలువురు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్ల సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ, ఐ.పోలవరం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ కేశనకుర్రుపాలెం ఫీడర్ మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మోకా రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కేశనకుర్రు, కేశనకుర్రుపాలెం, తిళ్లకుప్ప గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ ఉండదన్నారు.

విద్యార్థులు చదువుతో ఉన్నతంగా ఎదగాలి


విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సంపదరావు

ఉప్పలగుప్తం: విద్యార్థులు చదువుతో ఉన్నతంగా ఎదిగి పేరు, ప్రఖ్యాతలు తెచ్చుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. భీమనపల్లిలో శిరంగు రంగనాయకమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పథకం నగదుతో పాటు ప్రశంసా పత్రాలను ఆయన అందజేసి అభినందించారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, సొసైటీ అధ్యక్షులు శిరంగు సత్తిరాజు, హెచ్ఎం నూకల సత్యనారాయణ, పీఎంసీ చైర్మన్ సబ్బతి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలకు విలువ కట్టలేం

అమలాపురం టౌన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇంటి ముంగిటకు చేరుస్తున్న వలంటీర్ల సేవలకు విలువ కట్టలేమని అమలాపురం మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు అన్నారు. స్థానిక 15వ వార్డు సచివాలయ పరిధిలోని వలంటీర్లకు వందనం కార్యక్రమం గురువారం జరిగింది. కౌన్సిలర్ నాగ సుధారాణి అధ్యక్షతన జరిగిన సభకు కమిషనర్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 25వ వార్డులో వలంటీర్‌గా పనిచేస్తున్న సుంకర దిలీప్ సేవా వజ్ర అవార్డుతో పాటు రూ.30 వేల నగదు బహుమతిని అందుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పురస్కారాలకు ఎంపికైన వలంటీర్లను కమిషనర్ నాయుడు సత్కరించి అభినందించారు. స్థానిక 13వ వార్డు సచివాలయంలో వలంటీర్లను కౌన్సిలర్ యెండమూరి గంగ సత్కరించారు.


వలంటీర్ దిలీప్‌ను సత్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాయుడు తదితరులు

సీబీఎస్ఈ అకడమిక్ క్యాలెండర్ ఇవ్వాలి

యానాం: నియోజకవర్గంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్‌ను అమలుచేస్తున్న నేపథ్యంలో దానికి సంబంధించిన అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని ఆర్ఏఓ మునిస్వామికి యానాం యునైటెడ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీబీఎస్ఈ సిలబస్‌ను అనుసరిస్తున్న మిగతా రీజియన్‌లు పుదుచ్చేరి, కారైకల్‌లలో వారంలో 5 రోజులే పని దినాలు అమలవుతున్నాయని, కాని యానాంకు సంబంధించి ఏవిధమైన నిబంధనావళి రాకపోవడంతో యథావిధిగా ఆరు రోజులు పనిదినాలు అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఏ వలీ, వైస్ ప్రెసిడెంట్ తోట వెంకన్న, నల్లా కమల, కార్యదర్శి పాలెపు సత్తిబాబు, విజయలక్ష్మి, ఎస్‌వీవీ రత్ననాయుడు తదితరులు పాల్గొన్నారు.


సీబీఎస్ఈ సిలబస్ విధానంపై ఆర్ఏఓ మునిస్వామితో చర్చిస్తున్న యానాం టీచర్లు

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఐ.పోలవరం: స్థానిక జెడ్పీ పాఠశాల ఆవరణలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఐ.పోలవరం బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని 11 పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన వడ్డి చెరువు జెడ్పీ పాఠశాల విద్యార్థులకు రూ.5 వేలు, ద్వితీయ స్థానం సాధించిన ఐ.పోలవరం జెడ్పీ పాఠశాల విద్యార్థులకు రూ.4 వేలు, తృతీయ స్థానం పొందిన జి.మూలపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థులకు రూ.3 వేలు అందజేశారు. బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ మేనేజర్ జోగి రవి కిరణ్, ఇన్విజిలేటర్ కటకం నాగ నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంఈవో కె.వెంకటేశ్వరావు, పాఠశాల హెచ్ఎం వీధి సురేష్ బాబు తదితరులు అభినందించారు.


విజేతలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

పశువుకు బీమా పాడి రైతుకు ధీమా

కాట్రేనికోన: పశువులకు బీమా పాలసీ చేయడం ద్వారా పాడి రైతు ధీమాగా ఉండొచ్చని ఉప్పలగుప్తం సబ్ డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కుండలేశ్వరంలో బీమా పాలసీలతో కలిగే మేలుపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులపై రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలతో పాటు మేకలు, గొర్రెలు, ఆవులు, గేదెలకు వేయవలసిన వ్యాధి నిరోధక టీకాల గురించి వివరించారు. మండల పశువైద్యాధికారిణి యామిని ఆధ్వర్యంలో కుండలేశ్వరం పరిసర ప్రాంతాలకు చెందిన పాడి పశువులు, మేకలు, గొర్రెలకు నట్టల మందును వేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధక సహాయకుడు గొలకోటి గాంధీ, గోపాల మిత్రలు శ్రీకృష్ణార్జునుడు, చక్రవర్తి, సిద్దు తదితరులు పాల్గొన్నారు.


కుండలేశ్వరంలో గొర్రెలకు నట్టల మందును వేస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ నాగేశ్వరరావు

ద్విజ్‌గోయల్ రాజీనామా ఆమోదం

యానాం: యానాం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన పుదుచ్చేరి సివిల్ సర్వీస్(ఎంట్రీ గ్రేడ్) ద్విజ్‌గోయల్ రాజీనామాను ఆమోదిస్తూ ప్రభుత్వ కార్యదర్శి వి.జయశంకర్ అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేశారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలో దేశంలో 71వ ర్యాంకు సాధించిన ద్విజ్‌గోయల్ ఐఏఎస్‌కు ఎంపికైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఐఏఎస్ శిక్షణకు వెళ్లాల్సి ఉండడంతో ఆయన పెట్టుకున్న సాంకేతికపరమైన రిజిగ్నేషన్‌ను ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. ఆయన ఈ నెల 23 మధ్యాహ్నం నుంచి విధుల నుంచి రిలీవ్ అవుతారని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న గ్రామస్తులు

ముమ్మిడివరం: మండలంలోని గాడిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్ళిన ప్రధానోపాధ్యాయురాలు వంటెద్దు రాజేశ్వరితో పాటు మరో ఎనిమిది మంది ఉపాధ్యాయులను గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి మునీంద్రరావు, ఉప సర్పంచ్ పాముునాగలక్ష్మిల ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు పాము ప్రణవి, రెడ్డి యశ్వంత్, వాసంశెట్టి వాణిప్రసన్న, భూపతి లహరి నాగహస్యలకు పాఠశాల ఉపాధ్యాయుడు ఆకెళ్ల సూర్య మోహన్ రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొర్రెల ఉదయభాస్కరరావు, స్కూలు కమిటీ చైర్మన్ మహాదశ సుబ్బారావు, గిరిగి కోదండ పాణి, పాము శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యూడీసీ పరీక్ష ఏర్పాట్లపై సమీక్ష

యానాం: వచ్చే నెల 23న నిర్వహించనున్న అప్పర్ డివిజన్ క్లర్క్(యూడీసీ) పరీక్ష ఏర్పాట్లపై ఆర్ఏఓ మునిస్వామి వివిధ శాఖల అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఏఓ మునిస్వామి మాట్లాడుతూ యూడీసీ పరీక్ష సందర్భంగా యానాంలో ఎనిమిది సెంటర్లను ఏర్పాటుచేస్తున్నామని, ఆయా సెంటర్లకు ఎనిమిది మంది సూపర్‌వైజర్లను నియమించామన్నారు. సెంటర్లలో ముఖ్యంగా విద్యుత్, తాగునీరు, ఫర్నీచర్ తదితర మౌలిక సదుపాయాలుండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో మొత్తం 2,232 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారని తెలిపారు.


యూడీసీ పరీక్ష ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

విద్యుత్ తీగ తగిలి దింపు కార్మికుడి మృతి

కాట్రేనికోన: వేట్లపాలెం సమీపంలో గురువారం విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో దింపు కార్మికుడు యర్రా రాంబాబు (23) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా భోగాపురానికి చెందిన యర్రా రాంబాబు ఇద్దరు దింపు కార్మికులుతో పాటు కాట్రేనికోన కేంద్రంగా నివాసం ఉండి కొబ్బరి వ్యాపారులతో ఒప్పందంపై దింపు తీస్తున్నారు. కొబ్బరి వ్యాపారి బీర జాన్ వద్ద దింపు తీసేందుకు పనికి వెళ్లాడు. కొబ్బరి చెట్టు ఎక్కుతున్న సమయంలో అడ్డుగా ఉన్న ఆకు చివర పట్టుకుని లాగడంతో కిందకు వేలాడుతూ ఉన్న తీగపై పడటంతో విద్యుత్ షాక్ గురయ్యాడు. స్థానికులు స్పందించి చెట్టు నుంచి దించారు. అప్పటికే మృతిచెందాడు. కాట్రేనికోన ఎస్సై టి శ్రీనివాస్ కేసు నమోదు చేశారు.

జగనన్న పాల వెల్లువతో ఆర్థిక భరోసా

అల్లవరం: దళారీ వ్యవస్థ లేకుండా పాడి రైతులు నేరుగా పాలు విక్రయించుకుని ఆర్థికంగా స్థిరపడాలన్న సదుద్దేశంతో జగనన్న పాల వెల్లువ పథకం ప్రవేశపెడుతున్నట్లు పశు వైద్యాధికారి సీహెచ్ నారాయణరావు అన్నారు. ఎంట్రుకోన సచివాలయంలో సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాసరావు అధ్యక్షతన జగనన్న పాల వెల్లువపై పాడి రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పాడి రైతులు సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వం నిర్దేశించిన ధరకు పాలను విక్రయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ లక్ష్మణరావు, ఏపీఎం సయ్యద్, శ్రీమన్నారాయణ, పాడి రైతులు పాల్గొన్నారు.


జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీనివాసరావు

సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు

కొత్తపేట: సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు కల్పించి పేదల విద్యకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. గురువారం పలివెల, గంటి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో పురస్కారాలు అందించారు. ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ గంగాధరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు. విద్యలో నాణ్యత, విద్యార్థుల్లో పోటీతత్వం, తద్వారా వారిలో ప్రతిభను ప్రోత్సహించేందుకు 'జగనన్న ఆణిముత్యాలు' పేరుతో వినూత్న కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. ఆయా పాఠశాలల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన గున్నూరి వెంకటమోహన్, చల్లాబత్తుల సాయిదీప్తి, మల్లవరపు సునీత, డి.మోహిత సత్యదుర్గ, గుత్తుల శ్రీదుర్గ, వాడపల్లి జ్యోతిలను సత్కరించి, నగదు బహుమతులు అందించారు. సర్పంచ్ సాగి బంగార్రాజు, ఎంపీటీసీ సభ్యులు గునిపే శ్యామల, ముళ్ల జనార్దనరావు, హెచ్ఎంలు పి.ఇందిరాబాయి, అక్కిరెడ్డి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


పలివెలలో ఉత్తమ విద్యార్థులను సత్కరిస్తున్న ఎంపీపీ గంగాధరరావు